# దేశాయిపేటలో తాగునీటికి కటకట

- చాలీచాలని నీటి సరఫరాతో ప్రజల అవస్థలు
- ఎంహెచ్‌నగర్‌లో మరమ్మతులకు నోచుకోని పైపులైన్


సీఎస్‌ఐ చర్చి వీధిలో సన్నటి ధారతో వస్తున్న నల్లా నీరు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 20: వరంగల్ 12వ డివిజన్ దేశాయిపేటలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొంది. పాతకాలం నాటి పైపులైన్లతో నీటి సరఫరా సరిగా లేకపోవడంతో నల్లానీళ్లు ఒక బిందె నిండటానికి గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. అది కూడా నీటిని ఎప్పుడు వదులుతారో తెలియని పరిస్థితి. పక్కనే దేశాయిపేట రోడ్డులో ఫిల్టర్‌బెడ్ ఉన్నా నీటిగోస పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, ఎంహెచ్‌నగర్‌లో మూడు నెలల క్రితం పైపు లైన్‌కు లీకేజీ ఏర్పడింది. అయినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇటీవల దేశాయిపేటకు వచ్చిన మంత్రి కొండా సురేఖకు విన్నవించుకుందామన్నా అవకాశం ఇవ్వలేదని నిరాశకు లోనయ్యారు. దేశాయిపేటలోని పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీఎస్‌ఐ వీధి, గుండ్ల వీధి, రంగనాయకస్వామి ఆలయ పరిసర ప్రాంతాలతోపాటు ఎంహెచ్‌నగర్, వివర్స్ నగర్‌లో తాగునీటి కోసం స్థానికులు తండ్లాడుతున్నారు. గతంలో ఫిల్టర్ బెడ్ ద్వారా నేరుగా నీటి సరఫరా చేసేటప్పుడు బాగానే వచ్చాయని, ఇప్పుడు అధికారులు ఎనుమాముల ఫిల్టర్‌బెడ్ నుంచి సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు. ఎత్తైన ప్రాంతాల్లో ఉన్నవారికి సరిగా నీళ్లు రాకపోగా, శ్రీరంగనాయకస్వామి ఆలయ పరిసరాలు పది నెలల పైనుంచి చుక్క నీటికి నోచుకోవడం లేదని తెలుస్తున్నది. ఎండలు ఎక్కువవైనందున తాగునీటి సరఫరా సరిగా చేయాలని ఓల్డ్ గవర్నమెంట్ స్కూల్ స్ట్రీట్‌కు చెందిన ల్యాదెళ్ల సుకీర్తి చంద్ర కోరారు. తక్కువ ప్రెషర్‌తో నీళ్లు వస్తుండడంతో రెండు బిందెలు కూడా నిండడం లేదని సీఎస్‌ఐ చర్చి వీధికి చెందిన కోడెపాక సలోమి తెలిపారు. వేలాపాల లేకుండా నీళ్లు విడుదల చేస్తున్నారని దేశాయిపేటలోని గుండ్లవీధికి చెందిన గండి ఆనందం ఆవేదన వ్యక్తం చేశారు.


ఎంహెచ్‌నగర్‌లో మరమ్మతులు చేయని పైపులైన్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

సంగెం, ఏప్రిల్ 20: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కాపులకనపర్తి సొసైటీ ఆధ్వర్యంలో షాపురం, సోమ్లాతండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి రేవూరి ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2320, కామన్ రకానికి రూ. 2300 ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమేశ్, ఎంపీడీవో రవీందర్, ఏవో యాకయ్య, సొసైటీ చైర్మన్ సంపత్‌గౌడ్, మాధవరెడ్డి, నాగరాజు, నర్సింహానాయక్, రమేశ్, ఈర్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సీఈవో చారి, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు అందని దినసరి వేతనాలు

**ఇబ్బందులు పడుతున్న కూలీలు**


కడారిగూడెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వర్ధన్నపేట, ఏప్రిల్ 20: కూలి పనులపై ఆధాపడి జీవనం సాగిస్తున్న ఉపాధిహామీ కూలీలకు వేతనాలు అందకపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దినసరిగా ప్రతి గ్రామంలో కూలీలు పదుల సంఖ్యలో ఉపాధి పనులకు వెళ్తున్నారు. చెరువుల్లో పూడిక మట్టి తీయడం, కందకాలు నిర్మించడం, ఫిష్‌పాండ్‌లు, పాంపాండ్‌ల నిర్మాణ పనులకు ఉపాధి కూలీలను పంపిస్తున్నారు. రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే, పనులు చేసే చోట సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోతున్నారు. వడదెబ్బకు గురైతే ప్రథమ చికిత్సతోపాటు కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచాలి. కానీ, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

### నేడు బల్దియాలో గ్రీవెన్స్

వరంగల్, ఏప్రిల్ 20: మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు నగర ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### మతిస్థిమితంలేని ఒకరి మృతి

నర్సంపేట, ఏప్రిల్ 20: మతిస్థిమితం లేని ఒకరు మృతి చెందిన ఘటన పట్టణంలో జరిగింది. ఖానాపురం మండలం పెద్దమ్మగడ్డతండాకు చెందిన మచ్చిక రాజు(43) మతిస్థిమితం సరిగ్గాలేక గ్రామాల్లో తిరుగుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి నడుచుకుంటూ వచ్చిన రాజు అదే రాత్రి అనారోగ్యంతో పట్టణంలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు మచ్చిక వీరేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.



సంగెం: ఎల్లుగూర్‌రంగంపేటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, నర్సంపేట: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# రజతోత్సవ సభకు దండుగా తరలిరావాలి

- బీఆర్‌ఎస్ నాయకుల పిలుపు
- గ్రామాల్లో సన్నాహక సమావేశాలు
- ప్రచార వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

సంగెం/నర్సంపేట, ఏప్రిల్ 20: బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ శ్రేణులు దండుగా తరలిరావాలని బీఆర్‌ఎస్ నేత నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి పిలుపునిచ్చారు. ఆదివారం సంగెం మండలంలోని ఎల్లుగూర్ రంగంపేట, తిమ్మాపురం, కొత్తగూడెం, గాంధీనగర్, నర్సానగర్, ఎల్లుగూర్‌స్టేషన్, బిక్కోజీనాయక్‌తండా, సోమ్లాతండా, తీగరాజుపల్లిలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన సభకు గులాబీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పులుగు సాగర్‌రెడ్డి, జక్క మల్లయ్య, బుక్క మల్లయ్య, సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, పూజారి గోవర్ధన్ గౌడ్, ఉండీల రాజు, మన్సూర్ అలీ పాల్గొన్నారు. నర్సంపేట పట్టణంలోని 17, 18వ వార్డుల్లో సన్నాహక సమావేశాలు జరిగా యి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు గులాబీ జెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎల్కతుర్తిలో జరిగే గులాబీ జాతరకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, మాజీ కౌన్సిలర్లు బండి ప్రవీణ్, వాసం సాంబయ్య, శివరాత్రి స్వామి, పుల్లూరి స్వామి, నాయకులు రచ్చ రఘు, సారంగపాణి, సుదర్శన్, సదానందం, రవి, రమేశ్, రాంబాబు, కొమురయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతేకాకుండా నర్సంపేట మండలంలోని భాంజీపేట, చంద్రయ్యపల్లి, రాజేశ్వర్‌రావుపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు జరిగాయి. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహ రాములు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పాల్గొన్నారు.


నర్సంపేట: బీఆర్‌ఎస్ నాయకుకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ


చెన్నారావుపేట: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

### సభ విజయవంతానికి కృషి చేయాలి

గీసుగొండ/చెన్నారావుపేట: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి కృషి చేయాలని గీసుగొండ మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, పార్టీ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని కోనాయిమాకుల, ఎలుకుర్తిలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. 27న ఉదయం గ్రామాల్లో పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గులాబీ జెండాలను ఆవిష్కరించాలన్నారు. మధ్యాహ్నం రెండు గంటల్లోగా ఎల్కతుర్తి సభా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి గ్రామానికి ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేట, గొల్లపల్లి, గొల్లభామతండా, సూర్యాపేట తండాలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బాల్నె వెంకన్న మాట్లాడుతూ ఎల్కతుర్తిలో 27న జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు జక్క అశోక్, కంది కృష్ణ చైతన్యరెడ్డి, మురహరి రవి, అనుముల కుమారస్వామి, హంస విజయరామరాజు, భూక్యా శ్రీనివాస్, మురళీనాయక్ పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు

గిర్మాజీపేట, ఏప్రిల్ 20: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు సత్తా చాటినట్లు సంబంధిత శాఖ అధికారి డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బాలికల సీవోఈ కళాశాల నుంచి 88.2 శాతంతో నునావత్ అరుణ, 87.9 శాతంతో అనూషచౌహాన్, 87.18 శాతంతో అనుదీపిక, 82.95 శాతంతో రాజేశ్వరి, 82.60 శాతంతో మనోజ్ఞ, 82.33 శాతంతో ప్రవళిక, యాకూబ్‌పుర బాలుర కళాశాల నుంచి 83.9 శాతంతో వంశీ, 79.7 శాతంతో రాకేశ్, 77.92 శాతంతో రాహుల్, 74.9 శాతంతో కిరణ్, 73.39 శాతంతో బాలరాజు ప్రతిభ కనబర్చినట్లు వెంకన్న వెల్లడించారు.

### ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో.. డ్రైవర్‌కు గాయాలు

వర్ధన్నపేట, ఏప్రిల్ 20: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టిన ఘటన ఇల్లంద వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లంద వ్యవసాయ మార్కెట్ సమీపంలో లారీ చెడిపోవడంతో డ్రైవర్ పక్కన నిలిపాడు. లారీని వరంగల్‌కు తరలించేందుకు లిఫ్టింగ్ వాహనాన్ని తీసుకొచ్చి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆటో ఎదురుగా వచ్చి లిఫ్టింగ్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ లారీ కింద ఇరుక్కుపోవడంతో స్థానికులు, హమాలీలు ఆటోను వెనక్కిలాగి డ్రైవర్‌ను బయటకు తీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆటో డ్రైవర్‌ను ఎంజీఎం దవాఖానకు తరలించారు. అనంతరం దర్యాప్తు చేపట్టారు.

### ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం

నర్సంపేట, ఏప్రిల్ 20: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఆదివారం పట్టణంలో ప్రారంభమయ్యాయి. ద్వారకపేట రోడ్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు)లో 160 మందికి 139 మంది విద్యార్థులు, జడ్పీహెచ్‌ఎస్(బాలురు)లో 121 మందికి 109, మోడల్ హైస్కూల్‌లో 119 మందికి 99 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు.

### నల్ల జెండాలతో గుడిసె వాసుల నిరసన దీక్షలు

నర్సంపేట, ఏప్రిల్ 20: గుడిసె వాసులకు పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అంబేద్కర్‌నగర్ గుడిసె వాసులు నల్ల జెండాలతో ఆదివారం వినూత్నంగా నిరసన తెలిపారు. పట్టణంలో ఎమ్మెస్పీ, డీబీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఎండీ మహబూబ్ అలీ సంఘీభావం తెలిపి మాట్లాడారు. గుడిసె వాసుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

నెక్కొండ, ఏప్రిల్ 20: సూరిపల్లిలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్న మూలం రమేశ్ కుమారుడు రఘువీర్ మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం బీఆర్‌ఎస్ నేతలు పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్ బాధిత గ్రామానికి వెళ్లి రఘువీర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### రాంకీ విల్లాలో బంగారం, నగదు అపహరణ

కరీమాబాద్, ఏప్రిల్ 20: వరంగల్ రాంకీ విల్లాస్‌లోని ఓ ఇంట్లో ఆదివారం దొంగతనం జరిగింది. బాధితుడు తొగరు వంశీకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి సామగ్రి చిందరవందరగా పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వరంగల్ ఏసీపీ నందిరాం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 10 తులాల బంగారం, 1.50 లక్షల నగదు అపహరణకు గురైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

## మంత్రి సురేఖను కలిసిన సీకేఎం ప్రిన్సిపాల్


పోచమ్మమైదాన్: మంత్రికి పూల మొక్క అందజేస్తున్న ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి

పోచమ్మమైదాన్/ఖిలావరంగల్, ఏప్రిల్ 20: రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ధర్మారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మంత్రి నివాసానికి వెళ్లి పూల మొక్క అందజేశారు. కళాశాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని మంత్రి ఆయనకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్, లైబ్రేరియన్ ఎస్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, శివనగర్ పుప్పాలగుట్టపై జరిగిన ఈస్టర్ పండుగకు మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, రేణికుంట్ల శివ, కొత్తూరు రాజు, శ్రీరాం రాజేశ్, రామ ప్రభుచరణ్ పాల్గొన్నారు.

## పేదల గోడును పట్టించుకోని ప్రభుత్వం

- హామీలు అమలు చేయని కాంగ్రెస్
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

వరంగల్‌చౌరస్తా, ఏప్రిల్ 20: పేదల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సీపీఐ జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంగా గుర్తింపు ఉన్న వరంగల్‌ను మరింత అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్.. నేడు అధికారం దక్కిన తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. టెక్స్‌టైల్ పార్కును అభివృద్ధి చేసి పారిశ్రామికంగా వరంగల్‌ను ముందుకు తీసుకెళ్తామని చెప్పిన నాయకులు.. కనీసం పార్కులో తట్టెడు మట్టిపోయలేదని ఎద్దేవా చేశారు. కంతనపల్లి ప్రాజెక్ట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఉమ్మడి వరంగల్ జిల్లాను సస్యశ్యామలం చేయాల్సిన నీటి వనరుల విషయాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేశ్, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరుపాటి సహాయం


కొండాపురంలో నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

రాయపర్తి, ఏప్రిల్ 20: మండలంలోని కొండాపురంలో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, చేరికల కమిటీ మండల చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం చేయూతనిచ్చారు. శ్రీనివాస్‌రెడ్డి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన పాక సోములు, జిలుకర భిక్షపతి, తరాల నర్సయ్య కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం, వంట నూనె, నిత్యావసర వస్తువులు అందజేసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, పూస మధు, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, గజవెల్లి ప్రసాద్, మహ్మద్ అశ్రఫ్‌పాషా, చందు రామ్‌యాదవ్, మహ్మద్ మోహినొద్దీన్, తేరాల యాకయ్య, రాజు, పాక మహేందర్, కనుకుట్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ఖిలావరంగల్, ఏప్రిల్ 20: అకాల వర్షాల నేపథ్యంలో రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో సూచించారు. వచ్చే రెండు రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు తెలిపారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని కోరారు.


కరీమాబాద్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కరీమాబాద్, ఏప్రిల్ 20: పాఠశాలలో 25 ఏండ్ల క్రితం కలిసిమెలిసి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఒకచోట చేరారు. సరదాగా ఆడిపాడి ఆనందంగా గడిపారు. చిన్నతనంలో జరిగిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉర్సులోని శ్రీవేంకటేశ్వర ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు లక్ష్మీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అలాగే, నర్సంపేటలోని ఉదయశ్రీ హైస్కూల్ 2009–10 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. గురువులను ఘనంగా సన్మానించారు.


నర్సంపేట: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## దుర్గంధంలో గ్రామాలు

**పారిశుధ్య పనులు నిల్**

**పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**


బీకేతండాలో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీని శుభ్రం చేసుకుంటున్న మహిళలు (ఫైల్)

వర్ధన్నపేట, ఏప్రిల్ 20: గ్రామాల్లో దుర్గంధం వెదజల్లుతున్నది. పారిశుధ్య పనులు కానరాకపోవడంతో పట్టణాలు, పల్లెలు, తండాలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. డ్రైనేజీల్లో మురుగునీరు వెళ్లలేని దుస్థితి. వెరసి స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీతోపాటు విలీన తండాల్లో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పట్టణంలోని పలు వార్డుల్లోనూ దుర్గంధం వెదజల్లుతున్నదని ప్రజలు వాపోతున్నారు. సిబ్బంది కాల్వలను శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్యం పేరుకుపోతున్నది. గుబ్బెటితండాలోని ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీ నిర్మించారు. ఏడాది గడుస్తున్నా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు వెళ్లడం లేదు. దీంతో దుర్వాసన వస్తుండడంతోపాటు దోమలు వృద్ధి చెంది ఇండ్లలో స్వైరవిహారం చేస్తున్నాయని తండావాసులు వాపోతున్నారు. చేసేదేమీ లేక తండాకు చెందిన మహిళలే స్వయంగా ముందుకొచ్చి ఎవరి ఇండ్ల ఎదుట వారే డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించుకుంటున్నారు. అధికారులు స్పందించి నిత్యం పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సివిల్ సప్లయ్ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

నర్సంపేట, ఏప్రిల్ 20: సివిల్ సప్లయ్ హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సివిల్ సప్లయ్ హమాలీ, కార్మికుల జిల్లా మహాసభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం సివిల్ సప్లయ్ గోదాం ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. మే 11న వరంగల్ ఎనుమాముల మార్కెట్ గోదాం వద్ద జిల్లా మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. సమావేశంలో మహేందర్, రవికిశోర్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఎన్నిక

ఖానాపురం, ఏప్రిల్ 20: మండలంలోని బుధరావుపేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి సురేశ్, ఉపాధ్యక్షుడిగా దబ్బేట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొల్లం హరీశ్, అధికార ప్రతినిధిగా షేక్ హుస్సేన్, కార్యదర్శులుగా నాగుల రమేశ్, చెడిపాక అశోక్, పెద్దపల్లి యాకయ్య, కోశాధికారులుగా నాలగిరి మధు, షేక్ రబ్బాని, కార్యవర్గ సభ్యులుగా మానిపాటి రాజు, గొల్లపల్లి ప్రకాశ్, బానోత్ నగేశ్, చల్ల యాకన్న, కోడి రాకేశ్ ఎన్నికయ్యారు.

## వరంగల్‌లో గంజాయి పట్టివేత

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 20: ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన గంజాయిని నగరంలో విక్రయించేందుకు వచ్చిన ఇద్దరిని మట్టెవాడ పోలీసులు ఆదివారం జెమిని టాకీస్ జంక్షన్ వద్ద పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ. 25 వేల విలువైన 500 గ్రాముల ఎండు గంజాయి, రెండు మొబైళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు.

## ధర్మారంలో భగవద్గీతపై ప్రచారం

గీసుగొండ, ఏప్రిల్ 20: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధా నందయోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలతోపాటు వంద రకాల గ్రంథాలతో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి భగవద్గీత గొప్పతనంపై వివరించారు.

## కిరాణా షాపులో చోరీ

నెక్కొండ, ఏప్రిల్ 20: మండలంలోని కస్నాతండా జీపీ పరిధి ఎస్సీ కాలనీలో పానుగంటి అశోక్‌కు చెందిన కిరాణా దుకాణంలో షట్టర్‌ను ధ్వంసం చేసి లోనికి చొరబడి దుండగులు చోరీ చేసినట్లు ఎస్సై మహేందరర్ ఆదివారం తెలిపారు. కిరాణా షాపులో రూ. 9 వేల నగదు, రూ. 2,300 విలువైన సామగ్రిని శనివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని పోలీసులు ఆదివారం పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి

కరీమాబాద్, ఏప్రిల్ 20: ఈ నెల 29 నుంచి నిర్వహించనున్న భద్రకాళీ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని బ్రహ్మోత్సవాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ పిలుపునిచ్చారు. పెరికవాడలోని ప్రతాపరుద్ర కల్యాణ మండపంలో శ్రీభద్రకాళీ బ్రహ్మోత్సవాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ మే 7న పెరిక కులస్తులు ఉభయ దాతలుగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్రహ్మోత్సవాలకు ప్రజలు తరలిరావాలని కోరారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం

ఖానాపురం, ఏప్రిల్ 20: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. ఐనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాధవి, ఏఎన్‌ఎం జ్యోతి, యశోద, శోభ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీహెచ్ పంచాక్షరి

## కమ్యూనిటీ మీడియేటర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

వరంగల్ లీగల్, ఏప్రిల్ 20: కమ్యూనిటీ మీడియేటర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి పేర్కొన్నారు. నక్కలగుట్టలోని డీసీసీబీ సమావేశ మందిరంలో నిర్వహించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని వ్యక్తులు, సమూహాల మధ్య వైరుధ్యాలు, సంఘర్షణల పరిష్కారంలో శిక్షణ పొందిన మధ్యవర్తులు ఇరుపక్షాల మధ్య పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారానికి నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. సంఘర్షణ ఆరంభ దశలోనే పరిష్కరిస్తే డబ్బు, విలువైన సమయాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. కమ్యూనిటీ స్థాయిలో వాదనలు, వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వాన్ని ఎలా వినియోగించుకోవాలో శిక్షణ ద్వారా క్లుప్తంగా వివరించారు. వివాదాలను పరిష్కరించడంలో ఏదైనా సహాయం అవసరమైతే వారు నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా మండల న్యాయ సేవాధికార కమిటీని సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని సూచించారు. అనంతరం మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ మీడియేటర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమాజంలో శాంతి, న్యాయం, సామరస్యం కోసం ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు మరింత అవసరమని కమ్యూనిటీ పెద్దలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేశ్ బాబు, వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం సాయి కుమార్, క్షమాదేశ్ పాండే, రిసోర్స్ పర్సన్లు బాలకృష్ణ, సీతాదేవి పాల్గొన్నారు.


కంకర తేలి ఉన్న పూలరంగయ్య నుంచి చిన్న బ్రిడ్జికి వెళ్లే రహదారి

## అధ్వానంగా రహదారి

కరీమాబాద్, ఏప్రిల్ 20: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఆర్వోబీ కింద ఉన్న పూలరంగయ్య మలుపు నుంచి చిన్న బ్రిడ్జికి వెళ్లే రహదారి మట్టి కుప్పలు, కంకరతోపాటు గుంతలమయంగా మారింది. రోడ్డుకిరువైపులా పైపు లైన్ కోసం తవ్వి వదిలేయడంతోపాటు రోడ్డుపై పోసిన మట్టితో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.